# కార్తీక పురాణం

-భమిడిపాటి సోమయాజి

"ఏమండీ! గాయత్రిగారు లేరా!" అంటూ పొద్దున్నే వచ్చింది ఒకావిడ.

"లేదండీ! శివాలయానికి నాలుగున్నరకే వెళ్లింది. "ఏమిటి చెప్పండి? ఏం కావాలి!" అన్నాడు గాయత్రి భర్త శివమూర్తి.

"ఏం లేదు లెండి మళ్లీ వస్తాను. కార్తీకపురాణం పుస్తకాలు ఎన్ని కావాలో చెబుతామన్నారు. ఈరోజు మేము కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కి బయల్దేరి విజయవాడ వెడుతున్నాం. అందుకే అయిదు గంటలకే వచ్చి మిమ్మల్ని డిస్టర్బ్ చేశాను సారీ!" అంది ఆ వచ్చినావిడ.

"మీరు వెళ్లండి! ఈరోజు సాయంకాలం ఫోన్‌లో చెపుతాం" అని పంపించేశాడు గాయత్రి భర్త.

"అబ్బ! దీనికి ఇంత భక్తి ఉందని తెలిస్తే అసలు దీన్ని చేసుకోపోదును! కార్తీకమాసం వస్తే చాలు తెల్లారకట్ల మూడున్నరకి లేచిపోతుంది. ఇంక ఇంట్లో చప్పుళ్లు! ఏం నిద్రపడుతుంది! ఈ కార్తీక మాసం అంతా ఇదే భాగోతం!" అనుకున్నాడు గాయత్రి భర్త. అతను బాధపడడంలో కూడా కొంత న్యాయం లేకపోలేదు! కార్తీక మాసమంతా తెల్లారకట్ల లేచి గాయత్రి స్నానం చేసి, ఇంట్లో పూజ చేసుకుని, సరిగ్గా అతనికి నిద్రపట్టే సమయానికి "నేను గుడికి వెడుతున్నాను ఆ వీధి తలుపు వేసుకోండి" అంటుంది. సరే! వీధి తలుపు వేసుకుని వచ్చి "మళ్లీ నిద్రపోదాం" అనుకునేసరికి, పాలు ఇచ్చే అతను వచ్చి "ఆ! పాలూ!" అని గట్టిగా అరుస్తాడు. మళ్లీ లేవాలి. సరే! పాలు ఫ్రిజ్‌లో పెట్టి, మళ్లీ కాసేపు పడుక్కుందామనుకునేసరికి పనిమనిషి తయారు! "అయ్యగారూ! బట్లసబ్బు ఇవ్వండి! గిన్నెలు తోముకునే సబ్బు ఇవ్వండి. ఈ బకెట్లో ఫినాయిల్ వేయండి!" అంటూ ఇటువంటి పనులు సాధారణంగా రిటైర్ అయిన తరువాత చెయ్యవలసి వస్తుందని చెప్పుకుంటారు ఆఫీసుల్లో! పాపం గాయత్రి భర్తకి, ఉద్యోగంలో ఉండగానే పట్టేసింది ఈ అదృష్టం! ఇవన్నీ భరిస్తాడనే కాబోలు చాలామంది అతనికి 'శివమూర్తి' అనే పేరు ఉన్నా "గాయత్రి భర్త" అని పిలుస్తూంటారు. భర్త అంటే భరించువాడని కదా అర్థం. ఇలా నిద్ర సరిగ్గా లేకపోవడం వలన ఆఫీసులో ఇతని ముఖం చూసినవాళ్లు "ఏమిటయ్యా! చాలా డల్‌గా ఉన్నావు. ఏమైనా ప్రోబ్లమ్స్ ఉన్నాయా!" అని అడుగుతారు, పెద్ద తీర్చేవాళ్లలా!

ఇంట్లో విషయాలు ఏమి చెపుతాడు పాపం! "అబ్బే ఏం లేదు!" అంటాడు గాయత్రి భర్త.

శివమూర్తికి, అదే గాయత్రి భర్తకి పాపం డయాబిటీస్ పదేళ్ల క్రితమే వచ్చేసింది. రిటైర్ అయిన తర్వాత చెయ్యవలసిన పనులు ముందే చెయ్యవలసి వచ్చినట్లు! పాపం అతని వయస్సు ముప్పై సంవత్సరాలే. కార్తీక సోమవారం ఉపవాసం ఉన్నప్పుడల్లా, "ఏమండీ మీరు అన్నం తినేసి, ఆ కంచం ఎత్తేసి ఆ గిన్నెలు బాత్‌రూమ్‌లో పడేసి అక్కడ నీళ్లు జల్లి శుద్ధి చేసేయ్యండి. మళ్లీ ఆ అంట్లూ అవీ ముట్టుకుంటే నేను స్నానం చేయాలి. మళ్లీ సాయంకాలం ఎలాగా స్నానం చేయనిదే ఫలహారం తినను మీకు తెలుసుకదా!" అంటుంది గాయత్రి.

"తెలుసు! అన్నీ తెలుసు! తెలిసి ఏం లాభం? పాపఖర్మలు అనుభవించాలి కదా!" అంటాడు విసుగుతో.

"అలా అనకండి! తప్పు! పక్కింటి వనజ భర్తను చూసి నేర్చుకోండి! వనజ ఉపవాసం ఉంటే ఆయనే అన్నీ వండుకుని తను తిని పిల్లలకు పెట్టి ఆఫీసుకు వెళతాడు లక్షణంగా" అంది గాయత్రి.


'అంటే భర్త ఇంట్లో వంట చేయడం మంచి లక్షణం అన్నమాట!' అని లోపల అనుకుంటాడు. అసలు శివమూర్తిని వాళ్ల అమ్మగారు చాలా గారంగా పెంచారు. ఒక్కడే కొడుకు! పదిహేను సంవత్సరాలు వచ్చేవరకూ కొడుక్కి అన్నం తిన్న తర్వాత మూతి కూడా కడిగేది ఆవిడ! మరీ మీసాలు కొంచెం చేతికి తగుల్తూంటే మూతి కడగడం ఇంక బాగుండదని మానేసిందావిడ. విధివశాత్తూ గాయత్రిని చేసుకుని నానా 'అంట్ల పన్లూ' చేస్తున్నాడు పాపం! అందుకే ఇంటి విషయాలు ఆఫీసులో చెప్పడు.

"అంట్ల వెధవ" అనుకుంటారేమో అని భయం!

"స్వభాను" సంవత్సరంలో అయితే అన్నీ మొగుడూ పెళ్లాల్లాగా జంటగా వచ్చేశాయి. చంద్ర గ్రహణం, కార్తీక పౌర్ణమి ఒక శనివారం, ఇంకో శని



వారమేమో శనిత్రయోదశి, మాసశివరాత్రి! ఇంక ఇంట్లో చూడాలి. గాయత్రికి శివమెత్తిపోతుంది! "ఇలా రాకండి. ఇక్కడ మన్నీళ్లు ముట్టుకుంటారని, పూజలు చెయ్యకపోతే పోయె! కనీసం స్నానం చేసి విభూతి పెట్టుకుని కూర్చోండి" అని సతాయించింది. అందుకే ఆ స్వభాను సంవత్సరం దెబ్బ ఇప్పటికీ మరచిపోలేదు శివమూర్తి. అయినా ఒక్క స్వభాను సంవత్సరమనేమిటి కార్తీకమాసం వచ్చిందంటే చాలు "ఒక చోట కూర్చుని ఓం నమశ్శివాయ అని అలా ముప్పొద్దులా తిని కూర్చోకండి పంచాక్షరీ జపం చేసుకోమని, కొంచెం పుణ్యం సంపాదించుకోండి" అని తినేస్తుంది భర్తని!



ఒక సోమవారం రెండోసారి కొంచెం కాఫీ ఇస్తుందేమో అని వంటింటి దగ్గరకి వెళ్లి తొంగి చూశాడు. "మీరా లుంగీ కట్టుకుని ఇక్కడకి రాకండి! ఎన్నో సార్లు చెప్పాను శుభ్రంగా తెల్లటి పైజమాలు కుట్టించుకోమని! ఆ లుంగీ దేన్నికైనా తగిల్తే ఈ కార్తీక సోమవారం గంగలో కలసిపోతుంది!" అని గట్టిగా అరిచింది. అసలు తను అడుగుదామనుకున్నాడు. "గంగ ఈశ్వరుని భార్య కదా! ఆయనకి ఇష్టమైన సోమవారం గంగలో కలిస్తే తప్పేమిటి అనీ, ఆ గంగాభవుడికి అపచారం చేసినట్లు ఎలా అవుతుందో చెప్పమని!" "తర్వాత వచ్చేది మార్గశిర మాసం కదా అప్పుడు మట్టి కరిపిస్తుందేమో!" అని ఊరుకున్నాడు. కార్తీకమాసం ఇంక వెళ్లిపోతుందనగా ఒక ఆదివారం ఆ చుట్టుపక్కల వాళ్లని భోజనానికి పిలిచింది. కూరల మార్కెట్‌కి వెళ్లి, కూరలు అరిటాకులు తెమ్మంది. కనీసం ఆదివారమైనా మధ్యాహ్నం నిద్రపోదామంటే కుదరడం లేదు! భోజనాలయిన తర్వాత తమలపాకులూ వక్కపొడి వాళ్లకి ఇమ్మంది. దురదృష్టం.. అన్నీ తెచ్చాడు కానీ ఇవి మాత్రం మరచిపోయాడు.

"ఏం! ఎందుకు తేలేదు! ఆ మాత్రం తెలియదా!" అని గట్టిగా అరిచింది.

"పోన్లే! అమ్మా! ఇప్పుడేమి మునిగిపోయింది! కిళ్లీలు తెప్పిద్దాం!" అన్నాడు పక్కింటాయన.

'నీదేం పోదు! మాదే పోతుంది!' అనుకున్నాడు. కిళ్లీలు తెద్దామని వెడుతూంటే ఒకాయన "రెండు పాన్లూ జర్దావి తెమ్మన్నాడు. నాకు రెండు రత్నా జర్దా పాన్లు తీసుకురండి" అని ఇంకొకడు!

"ఇదేమిటి! ఇది కార్తీకమాసం సంతర్పణా లేకపోతే ఏమైనా పెళ్లి విందా!" అనుకున్నాడు. "హమ్మయ్య ఆఖరి సోమవారం వచ్చేసింది. మార్గశిరం వచ్చేవరకూ ఇంక గొడవ లేదు!" అనుకున్నాడు గాయత్రి భర్త. ఆఖరి సోమవారం ఉదయం ఏడు గంటలు అవుతోంది. గాయత్రి భర్తకి అప్పుడే కొంచెం నిద్ర పట్టింది. ఎవరో కాలింగ్ బెల్ కొట్టారు. వెళ్లి తలుపుతీశాడు. ఎదురుగా గాయత్రి! బిక్క మొహం వేసుకుని నిలబడింది.

"ఏమిటని" అడిగాడు.

"ఆ! ఏముందీ! ఈ కార్తీక మాసం అంతా ఒకటే పోరు ఇంట్లో! ఏమైనా పూజలా! భక్తా! మొన్న మీరు చేయించిన నాలుగు కాసుల గొలుసు ఎవ్వడో తెంపుకుపోయాడు" అంది గాయత్రి.

"ఇంట్లో పెట్టి వెళ్లకపోయావా!"

"మీరసలే నిద్రలో ఉంటారు! ఆ వీధితలుపు వెయ్యకపోతే ఎవడైనా పట్టుకుపోతాడని మెళ్లో వేసుకువెళ్లాను" అంది కళ్లలో నీళ్లు పెట్టుకుంటూ.

"మరి గొలుసు పోయిన వెంటనే వచ్చెయ్యకపోయావా ఇంటికి" అన్నాడు గాయత్రి భర్త.

"పోయింది పోతే పోయింది! ఆఖరి సోమవారం కదా అని శివాలయానికి వెళ్లిపోయా! అయినా ఇంటికి వచ్చి మిమ్మల్ని లేపేసరికి అరగంట పడుతుంది. ఆ స్కూటర్ మీద వచ్చి గొలుసు తెంపుకుపోయిన వాడు దొరుకుతాడా ఏమిటి!" అని దబాయించింది. తర్వాత పోలీసు కంప్లైంట్ ఇచ్చారు. కేసు నడుస్తోంది. ఒకసారి సి.ఐ.గారు కూడా వచ్చారు.

"అన్నయ్యగారూ! ఎలా అయినా ఆ గొలుసు ఇప్పించండి" అని అడిగింది గాయత్రి.

యూనిఫామ్‌లో ఉన్నప్పుడు "అన్నయ్యా, మామయ్యా" అని పిలవకూడదని చెప్పారు ఆయన. మధ్యలో గాయత్రి భర్త మాట్లాడడానికి ప్రయత్నిస్తే "మీరుండండి! ఆవిడ మాట్లాడుతున్నారు కదా!" అన్నారు సి.ఐ. అంటే శివమూర్తి సత్తా ఆయనకి అర్థమయిందన్న మాటే కదా!

"సరేనమ్మా! మా శాయశక్తులా దొంగల్ని పట్టుకోవడానికి ప్రయత్నం చేస్తాం" అని వెళ్లిపోతూంటే "మీరు వచ్చే సంవత్సరం కార్తీకమాసంలో జరిగే సంతర్పణకి మాత్రం తప్పకుండా రావాలి సార్!" అని ఆయన్ని ఆహ్వానించింది గాయత్రి.

★